❖•❖•❖ 2 ❖•❖•❖

# "నీ చిత్త ప్రకారమే కానిమ్ము"

*"కొంత దూరము వెళ్లి, సాగిలపడి – నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగిపోనిమ్ము, అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని ప్రార్థించెను" (మత్తయి 26:39).*

గురవారమునాడు ప్రొద్దు గ్రుంకుచుండగా, యేసు తనను తాను లోక పాపముల

కొరకైన పరిహారార్థ బలిగా సిద్ధపర్చుకొను నిమిత్తము ఆయన యెరూషలేము నుండి ఒకరి సొంత పండ్ల తోపులోని ఒలీవ చెట్లుండిన తోటలోనికి వచ్చాడు. ఆ తోట ఒలీవల కొండ దిగువన ఉండెను. మధ్య రాత్రివేళ, ఈ ప్రార్థనా జాగరణ ఆయన ఎప్పుడైనా గాని ఎదుర్కొన నంతటి అతి గొప్ప పోరాటము లోనికి ఆయనను దింపినది. ఆయన యొక్క పరిచర్య ప్రారంభంలో, అపవాది చేత శోధింపబడుటకు కొంత కాలము వానిని కలుసుకొనుట తట స్థించినది. ఆ విశ్వ సంఘర్షణభయంకరమైనదిగాను, సత్తువనంతటిని పీల్చివేయునదిగాను, చారిత్రాత్మకమైనదిగాను ఉండెను, కాని ఆయన శోధించబడిన నలువది దినములన్నిటను యేసు (ఆత్మ) విశ్వాసంగల వాడుగాను, తన స్వాధీనములో ఉన్నవాడుగాను, విజేతగాను ఉండెను. ఏది ఏమైనప్పటికిని, ఈ తోటలో ఉగ్రముగా కొనసాగిన యుద్ధము మరింత ఎక్కువ తీవ్రమైనదై యుండెను. అది ఆ నాడైనా నిత్యత్వములోనైనా అత్యంత గణ నీయమైన పోరాటమని చెప్పుకొనవచ్చును.

మత్తయి, మార్కు మరియు లూకా యేసు అనుభవించిన శ్రమలను చిత్రీకరించుటకు గ్రీకు భాషలోని అత్యంత బలమైన ఆరు పదబంధములను ఉపయోగించారు. ఆయన "బహు దుఃఖములో మునిగియున్నాడు" అని తన శిష్యులతో చెప్పాడు (మత్తయి 26:38); ఆయనకు కలుగుచుండిన దుఃఖము ఆయన ప్రాణము "మరణమగునంతటి" పరిస్థితిని కలుగజేయుచుండినదని కూడా చెప్పాడు (మత్తయి 26:38). ఆయన "మిగుల విభ్రాంతి నొందుటకును చింతాక్రాంతుడగుటకును" ఆరంభించెనని మార్కు నివేదించుచున్నాడు (మార్కు 14:33). "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేసెను"; "ఆయన చెమట" "నేల పడుచున్న" "గొప్ప రక్త బిందువులవలె" ఆయెను అని లూకా చెప్పాడు (లూకా 22:44).

తన ఎనమండుగురు అపొస్తలులను తోట ద్వారము దగ్గర విడిచిపెట్టి, యేసు ప్రత్యేక సన్నిహిత సంబంధమును కలిగియుండిన ముగ్గురు అపొస్తలులను - పేతురు, యాకోబు, మరియు యోహానును వెంటబెట్టుకొని ఒలీవలచెట్ల నడుమకు వెళ్లాడు. ఆ తోట అంధకారమయంగాను నిర్మానుష్యంగాను ఉండియుంటుంది. ఆయన బహు దుఃఖములో మునిగియున్నాడనియు ఆయన వచ్చువరకు వారు మెలకువగావుండి ప్రార్థనచేయుచుండవలెననియు ఆయనతో కూడా వెళ్ళినవారితో చెప్పిన తరువాత, ఆయన వారిని విడిచివెళ్లాడు. రాతివేత దూరమును మించి వెళ్ళి (లూకా 22:41), ప్రార్థించుటకు ఆయన ప్రారంభించాడు. ఆయన తన ముగ్గురు శిష్యులను విడిచిపెట్టిన చోటు నుండి "కొంత దూరము వెళ్ళి" అని చెప్పుచు మత్తయి ఆ సన్నివేశాన్ని వివరించాడు (మత్తయి 26:39). ఆయన ఒక చెట్టు క్రింద "మోకాళ్లూనెను" అని లూకా వ్రాసిన వృత్తాంతము చెప్పుచున్నది (లూకా 22:41). ఆయన వెంటనే "నేలమీద" పడెనని మార్కు కలిపాడు (మార్కు 14:35), ఆయన దేవుని యెదుట "సాగిలపడెను" అని చెప్పుచూ మత్తయి ఆ సన్నివేశానికి చివరి మెరుగులు దిద్దాడు (మత్తయి 26:39). మన రక్షకుడు చేసిన ప్రార్థనలోని తీవ్రత క్రమేపీ ఎక్కువైనదని ఈ ముగ్గురు సమదృక్పథ సువార్తల రచయితలు నివేదించిన నివేదికలు అర్థమిచ్చుచున్నవి: మొట్టమొదట, ఆయన మోకాళ్లూని ప్రార్థించాడు. ఆయన హృదయ భారము పెరుగుచుండిన కొలది, ఆయన నేల మీద పడ్డాడు. చివరకు, తన దుఃఖము యొక్క భారమువలన మిగుల చింతాక్రాంతుడై, తన తండ్రి యెదుట సాగిలపడ్డాడు. ఆయన దాని

భారము చేత దేవుని యెదుట సాగిలపడునంతగా దేవుని కుమారునిపై ఇంత ప్రయాసముతో కూడిన భారమైన దుఃఖము మోపబడుటను ఎవరైనా ఊహించగలరా?

లోకములో అత్యంత గాఢాంధకారమయమైన రాత్రిలో ఒలీవల చెట్లకొమ్మల క్రింద నుండిన మన రక్షకుడు తన తండ్రితో చెప్పిన ఒక సంకలనమును మత్తయి, మార్కు మరియు లూకా మనముందుంచారు. ఆయన మూడు అల్ప ప్రార్థనా అవదులను గడిపాడు, వారు ఇవ్వగలిగిన ఆదరణను పొందుకొని వారు ఆయనతో కూడా ఆయన కొరకు ప్రార్థించుచుండవలెనని వారికి మృదువుగా గుర్తుచేయుటకును ముగ్గురు అపొస్తలుల యొద్దకు రెండుసార్లు తిరిగి వచ్చాడు, మనము ఈ మూడు ప్రార్థనలను ధ్యానించునప్పుడు, ఆశ్చర్యకరుడైన మన రక్షకుని పరిశుద్ధ హృదయములోనికి ప్రవేశిస్తాము. మనము ఈ సన్నివేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించుట మాత్రమే గాక, మన పాపముల నిమిత్తము ఆయన అనుభవించిన శ్రమలలో, కొంతవరకైనా, మన వంతు భాగాన్ని పంచుకొందాము.

*మొదట, యేసు ప్రార్థించుట మనము చూచుచున్నాము.* ఆయన తన భారీ పోరాటాన్ని దేవుని యెదుట ఉంచాడు. క్రొత్త నింబంధన గ్రంథమును చదువువారందరు ఆయన మానవత్వమును, మానవాళితో గల ఆయన ఏకత్వమును, చూడగలుగునట్లు ఈ సన్నివేశము దానిని చిత్రీకరించుచున్నది. మానవుడు మాత్రమే ప్రార్థిస్తాడు. తారలు, చంద్రుడు, సూర్యడు, పొలములు మరియు అడవుల్లోని జంతువులు, ఆకాశపక్షులు, సముద్రములోని జలచరములు ప్రార్థించలేవు. అవి ఆలోచన మరియు ఎంపిక లేకుండానే దేవుని చిత్తమును నెరవేరుస్తాయి. దేవుని సృష్టి అంతటిలో, సజీవంగా ఉన్న ఆయన జీవులలో, మానవుడు మాత్రమే ప్రార్థిస్తాడు. వాడు అలోచిస్తాడు, హేతువును విచారిస్తాడు, విశ్వసిస్తాడు, మరియు వాని కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలతోను, యాచనలతోను, విన్నపములతోను బుద్ధిపూర్వకంగా దేవుని వైపు చూస్తాడు. వాడు జీవితము యొక్క అంధకార లోయలలోనికి చేరుకొన్నప్పుడు, నలుగగొట్టునవియు మిక్కిలి విభ్రాంతి కలిగించునవైన పోరాటములలోనికి చేరుకొన్నప్పుడు, మానవుడు మాత్రమే దేవుని యెదుట సాగిలపడగలడు.

యేసు దైవత్వములోని రెండవ వ్యక్తియై యున్నాడు, అట్లయినను తండ్రి యొక్క బలము అత్యావశ్యకమై యుండిన ఆయన దాసునివలె యేసు తన తండ్రికి ప్రార్థించాడు. ఆయన అన్యోన్య సహవాసము, ఆలంబనము, మరియు ఆయన చేయాల్సిన పని గూర్చి ఒక నూతన గ్రహింపు కొరకు తన తండ్రిని సమీపించాడు. మార్కు ప్రకారము, అంధకారమయమైన మేఘము చేత అలుముకొనబడి యుండిన ఆయన, "నాయనా! తండ్రీ!" అని కేకవేశాడు (మార్కు 14:36). "నాయనా" అను మాట దేవునితో గల దగ్గరి సంబంధము మరియు సన్నిహితమును సూచించు అరామీ భాషలోని పదమైయున్నది. యేసు ఆయన మీద మోపబడి యుండిన గొప్ప భారమును తన దేవుని యెదుట ప్రార్థన ద్వారా పడవేశాడు. యేసు, సంపూర్ణమైన మానవుడుగా ప్రార్థించాడు.

*రెండవది, ఆయన ప్రార్థనలో మానవ సహేతుకమును చూచుచున్నాము.* యేసు కేవలము ఒక దినమంత దూరములో ఉండిన భయమును గొలుపు విమోచన సిలువపై, తన దృష్టిని కేంద్రీకరించాడు. ఆయన, "నీకు మరొక మార్గమేదైనా తెలియునా?" అని తన తండ్రిని అడిగాడు. ఆయన సంపూర్ణముగాను మానవుడై యుండెను, అట్లయినను సంపూర్ణముగాను సమగ్రముగాను కుమారుడైన దేవుడై యుండెను. శ్రమా మేఘము

అలుముకొనుట ఆయన చూచినప్పుడు – లోక పాప దోషమును భరించాల్సిన భయంకరమైన ఘడియ సమీపించుట ఆయన చూచినప్పుడు – "దీనిని చేయుటకు మరొక మార్గమేదైనా కలదా?" అని ఆయనలోని మానవత్వము అడిగినది. మ్రానుపై వ్రేలాడజేయబడి మేకులు కొట్టబడుట ఆయనను సమీపించుచుండిన సంగతిని ఆయన అదివరకే చూశాడు, గనుక ఆయన దానిని అంగీకరించాడు. ఆయన పరిచర్యలో చాలా దినములకు ముందే, "ఇప్పుడు నా ప్రాణము కలవరపడుచున్నది; నేనేమందును? – తండ్రీ, యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము; అయినను ఇందుకోసరమే నేను ఈ గడియకు వచ్చితిని; తండ్రీ, నీ నామము మహిమ పరచుము" అని ఆయన తన శిష్యులతో చెప్పాడు (యోహాను 12:27, 28ఎ). తన ప్రశ్నతో, యేసు సిలువ నుండి వెనుకకు తగ్గుటలేదు. దాని గూర్చి ఆయన తన మనస్సు మార్చుకొనలేదు. ఆయన, మనుష్యకుమారుడు, ఒళ్లు గగుర్పాటు కలిగించు దాని పరిమాణములన్నిటిని మానవ సహేతుకముతో ఎదుర్కొనుచుండెను. మన ప్రభువు యొక్క ప్రశ్న దృష్ట్యా J. W. McGarvey గారి మాటలు యోచించుటకు తగినవై యున్నవి:

> శ్రేష్ఠంగా వ్యక్తము చేయుటకు గాను, యేసు తోటలోనికి ప్రవేశించినది మొదలుకొని ఆయన సిలువ మీద మరణించినంత వరకు ఆయనలోని మానవత్వము శక్తిలోను ప్రభావములోను పెరుగుచుండినదై యుండినది; మరియు "ఆకారమందు మనుష్యుడుగా కనబడి," ఆయన ఆమూలాగ్రముగా మానవుడై యుండినట్లు ఈ అగచాట్లను సహించాడు. కాబట్టి ఆయన ప్రార్థన, విడుదల కొరకైన ఆయనలోని మానవత్వము యొక్క కేకయై యున్నదని మనము చెప్పుకొనవచ్చును.[1]

*మూడవదిగా, చెల్లింపబడవలసి యుండిన మూల్యముతో నిమిత్తము లేకుండానే, ఆయన దేవుని చిత్తమును వెదకుచుండెనని ఆయన చేసిన ప్రార్థనలు చూపించుచున్నవి.* ఆయన దేవుని నిత్య సంకల్పము నుండి తప్పించుకొనవలెనని ఎన్నడును ఉద్దేశించలేదు. ఆయన ప్రార్థనల తొలి వ్యవధిలో, తోటలోనికి తన స్వయిష్టమును నెరవేర్చుకొనుటకు రాలేదు కానీ, దేవుని చిత్తము నెరవేరునట్లు తనను తాను అర్పించుకొనుటకు వచ్చెనను భావమును సూచించాడు. జే. డబ్ల్యు. మెక్‌గార్వే గారి మాటలను మరొకసారి ఆలోచించండి:

> ఆయన ప్రార్థనలు ప్రారంభమగుచున్న, "సాధ్యమైతే" అను మాటలు, అణకువగల విధేయతతో కూడిన అదే స్ఫూర్తిని ముగింపులో పలికిన మాటలలో కనుపర్చుచున్నవి. తండ్రి కలిగియున్న అపరిమితమైన శక్తి వ్యాప్తిచెందియున్న మేరను ఆయనకు గుర్తుచేస్తూ, తన కృపాసహిత ఉద్దేశములు ఏదైన ఇతర విధానములలో అమలుపర్చబడగలిగినట్లయితే, కుమారుడు సిలువవేయబడవలెనను తన ఆలోచనను మార్చుకొనవలెనని తండ్రిని విన్నవించుకొన్నాడు.[2]

ప్రభువైన యేసు ఈ ఆత్మవేదనలోనే లీనమై నేల మీదనే ఎంత సేపు సాష్టాంగపడి యుండెనో, మనమెరుగము. ఆయన దానిని "ఒక గడియ" అని సూచించాడు (మత్తయి 26:40), కానీ ఆయన ఈ మాటను అలంకారయుక్తముగా ఉపయోగించి యుండవచ్చును. ఏది ఏమైనా, ఈ విన్నపమును (మత్తయి 26:39) ఆయన తోటలో తను విన్నవించుకొన్న ప్రారంభంలోనే పలికెనని స్పష్టమగుచున్నది. అటుతరువాత, ఆయన రెండవసారి ప్రార్థించినప్పుడు, "నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనే గాని యిది నాయొద్ద నుండి తొలగిపోవుట సాధ్యముకానియెడల, నీ చిత్తమే సిద్ధించు గాక" అని పలికాడు (మత్తయి

26:42). దేవుని చిత్తమును నెరవేర్చుట ఆయన మనస్సులో ఆది నుండి అంతము వరకు కూడా అత్యంత ప్రధానాంశమై యుండినది. దేవుని చిత్తములో ఆవేదన మరియు రక్తముతో నిండియుండిన సిలువ తప్ప మరేదియు లేకుండినట్లయితే, దానిని స్వీకరించుటకు యేసు సిద్ధమై యుండెను.

ఆయన ప్రార్థన చేయుట మొదలు పెట్టినది మొదలుకొని ఆ గడియ ముగించేంత వరకు, మూలాధారమును, దేవుని నిత్య సంకల్పము యెడల కలిగియుండిన ఆనివార్యమును అచంచలమునైన అంగీకారమును ఆయన ప్రదర్శించాడు. యేసు సాధ్యములకు సంబంధించిన "అయితే" అను పదమును తన ప్రార్థనల ప్రారంభంలో ఉపయోగించాడు: "నా తండ్రీ, సాధ్యమైతే, ఈ గిన్నె నా యొద్దనుండి తొలగిపోనిమ్ము" (మత్తయి 26:39బి; నొక్కి చెప్పింది నాది). మనము "నీవు మరొక మార్గమును సమకూర్చినట్లయితే, అప్పుడు నేను దానిని అంగీకరిస్తాను: లేనట్లయితే, నేనంగీకరించను" అని ప్రార్థిస్తుంటాము. యేసు "అయితే" అను పదమును ఈ విధంగా ఉపయోగించలేదు. మనము మన స్వంత విధానాన్ని స్వాధికారంతో అడుగుటకు ఈ పదమును ఉపయోగిస్తాము; యేసు దేవుని చిత్తమును వెదకుచూ ఈ పదాన్ని ఉపయోగించాడు. ఎటువంటి పరిస్థితి ఎదురైన – అది మాధుర్యమైన సమాధానము కావచ్చు లేదా చేదైన ఖడ్గము కావచ్చు – దేవుడు ఏమి చేయవలెనని చెప్పునో దానినే ఆయన చేయునని ప్రకటించుటకు "అయినను" అని యేసు పలికాడు.

మధ్యరాత్రి వేళ చేయబడిన ఈ ప్రార్థనా జాగరణలో, సమస్త సృష్టిజాలము దానిని వీక్షించుటకు యేసు హృదయము తెరచి యుంచబడినది. ఆయన పాదములు మరియు హస్తములలో మేకులు దిగగొట్టబడుచుండుట వలన ఆయన సిలువపై శ్రమపడుతూ వుంటే మనము చూచుచున్నాము. ఆయన "నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యివిడిచితివి?" అని పలుకుచున్న పలుకులను మనము వింటూనే ఉన్నాము (మత్తయి 27:46). ఆయన సిలువ మీద నుండి పలికిన ఇతర ఆరు మాటలను ఆలకించుచున్నాము కానీ, మనము ఈ ప్రార్థనలలో గమనించుచున్న రీతిగా తనను తాను దేవుని చిత్తము యెదుట ఉంచుకొనుటలోగల ఆయన అంతర్గత ఎంపికను మనము చూచుటలేదు. ఆయన దేవుని సంకల్పమునకు తనను తాను నిశ్చయముగా లొంగునని ఆయన తన తండ్రికి ప్రార్థన ద్వారా తెలియజెప్పిన తరువాత, అట్లయితే ఆయనకు సంభవించునదేమో అను దానితో నిమిత్తము లేకుండానే, ఆయన ఎన్నడు వెనుదిరిగి చూడలేదు. దేవుని శ్రమ నొందు సేవకుని వలె, ఆయన పట్టబడి తీర్పు తీర్చబడిన రాత్రిలోనికిని, కొరడా దెబ్బలు కొట్టబడిన వేకువ జాము లోనికిని, శుక్రవారము ఉదయము తొమ్మిది గంటలకు సిలువవేయబడునట్లును ముందుకు వెళ్లాడు. ఆయన తన పరలోకపు తండ్రికి విధేయుడుగాను, నమ్మదగినవాడుగాను, మరియు విశ్వాసనీయుడుగాను ఉండుటకు ఆయన తోటలోనుండి వెళ్లిపోయాడు.

మన ప్రాధాన్యతలలో దేవుని చిత్తము ప్రథమ స్థానములో ఉండవలెనని తోటలో ఉండిన మన రక్షకుని నుండి మనము నేర్చుకొను(గుణ) పాఠమై యున్నది. ఆయన మాదిరియై యుంటూ, "నా తండ్రీ, నా యిష్ట ప్రకారము కాదు, నీ చిత్త ప్రకారమే కానిమ్ము" అని ప్రతి యొక్క శిష్యుడు పలుక గలుగునట్లు వారిని నడిపిస్తాడు. దేవుని చిత్తము తక్కిన వాటన్నిటికి మిన్నగా ఉంటుంది. దానికి ప్రత్యర్థిగా విరోధించునదేదియు ఉండజాలదు. పరిస్థితులతో గాని, పర్యవసానములతో గాని నిమిత్తములేకుండా – నేను ఏమి చేయవలసి వచ్చినను,

ఎలా చేయవలసివచ్చిననూ, లేక ఎంత కాలము చేయవలసి వచ్చిననూ. వీటన్నిటితో నిమిత్తము లేకుండానే - ఆయన చిత్తము నా ప్రథమ వాంఛయై యుండవలెను. రాత్రి జాము అంధకారమయమైనను, బాధ ఊహించబడజాలనిదైనను, దేవుని చిత్త ప్రకారము చేయుటయే సమాధానమునకు నిత్య జీవమునకును మార్గమై యున్నది.

❖◆❖◆❖

*గెత్సేమనే వనమును అంతగా అంధకారమయముగాను అంతగా దుఃఖ కరమైనదిగాను చేసినది బహుశ సిలువ యొక్క ఛాయ మాత్రమే అయియుండవచ్చును. లోకము యొక్క దోషము దాని పూర్తి భారమును యేసు హృదయముపై మోపుచూ అణగదొక్కుచుండినది; సిలువ యొక్క తలంపు ఆయన కళ్లముందుండినది. ఆయన త్రాగనై యుండిన గిన్నె లోక పాపములను ప్రాయశ్చిత్తము చేయు గొప్ప బలియాగమై యుండినది. దేవుని ఉగ్రత ఆ గిన్నెలో ఉండినది. నరకయాతనలు ఆ గిన్నెలో ఉండినవి; మనము ఎప్పుడైనా గాని చేసిన లేదా చేయునై యుండిన ప్రతి పాపము ఆ గిన్నెలో ఉండినది. ఆ గిన్నెను దగ్గరగా చూచుట మానవ హృదయము ఎప్పుడైనా ఎరుగని లొంగదీసుకొను విపరీతమైన భయమై యుండవచ్చును.*

---

సూచనలు

[1]J. W. McGarvey and Philip Y. Pendleton. *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati, Ohio: Standard Publishing Co., 1914), 686. [2]Ibid, 687.